క్లుప్తంగా

ఘనంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి: బాలానగర్, చరబండ రాజు కాలనీలో ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సంకష్టహర గణపతి విజయ దుర్గ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఆదివారం ఘనంగా జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, రమేష్, శివరంజని, నరేందర్ గౌడ్, ప్రదీప్ రెడ్డి, రాజేంద్ర కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్‌ను ఆదివారం ప్రారంభించారు. హెల్ప్ డెస్క్‌లో ఉన్న పట్టణ ప్రణాళిక అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో ప్రజలకు ఉన్న సందేహాలను తీరుస్తామని అధికారులు తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల యజమానులందరూ ఎల్‌ఆర్‌ఎస్ ఛార్జీలను మార్చి 31లోగా చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అనుమతులు లేని లే అవుట్లను రెగ్యులర్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

రాందేవ్‌రావ్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మీ కమలాకర్

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చెవినొప్పి, వినికిడి లోపం, చెవి నుంచి ద్రవం కారటం, తల తిరగడం, ముక్కు మూసుకుపోవటం, ముక్కు నుంచి రక్తం కారటం, ముక్కు నొప్పి, గొంతు నొప్పి, దగ్గు, చేదు శ్వాస, అలర్జీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు, ఈఎన్‌టీ సర్జన్‌లు డాక్టర్ ఎస్ శ్వేత, డాక్టర్ డి. లావణ్య, డాక్టర్ సి. స్వాతి, డాక్టర్ కె. శ్రీహర్ష, డాక్టర్ డైరెక్టర్ కమలాకర్, విక్రమ్‌దేవ్ రావు, మీరారావు, ప్రశాంత్ రెడ్డి, అపర్ణరావు పాల్గొన్నారు.

శ్రీరామ్ కాలనీ అసోసియేషన్ సమావేశం



కూకట్‌పల్లి: కై త్లాపూర్ శ్రీరామ్ కాలనీ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారావు, కార్యదర్శి తిరుపతి హాజరయ్యారు. కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అపార్టుమెంట్‌లు సంయుక్తంగా సహకరించాలని నిర్ణయించారు. కై త్లాపూర్ ఫ్లై ఓవర్ పక్కన ఉన్న సర్వీస్ రోడ్లు రెండు వైపులా 30 అడుగులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం ఆక్రమణలతో దాదాపు 27 అడుగులకు కుచించుకుపోయింది. దీనివల్ల టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆదర్శంగా ఉండాలి

కుత్బుల్లాపూర్: నేటి తరానికి సీనియర్ సిటిజన్స్ మార్గదర్శకులుగా ఉంటూ మంచి చెడులను వివరించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వర కాలనీ వెస్ట్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కుంట సిద్దిరాములు, సుధాకర్ గౌడ్, ఎల్లా గౌడ్, జ్ఞానేశ్వర్, విజయ్ హరీష్, సీనియర్ సిటిజన్ సభ్యులు సమ్మయ్య, శంకరయ్య, రాంచందర్, రాజ్‌కుమార్, ఆంజనేయులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి పాత శివాలయం వద్ద పగిలిన మ్యాన్‌హోల్



ఆస్‌బెస్టాస్ కాలనీలో మూతలేని మ్యాన్‌హోల్‌కు సూచనగా కట్టెలు ఏర్పాటు చేసిన స్థానికులు



ఆల్విన్‌కాలనీ మెయిన్‌రోడ్డులో కుంగిపోయిన మ్యాన్‌హోల్



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్!

- నాసిరకం నిర్మాణంతో కుంగిపోతున్న వైనం
- ప్రమాదాలబారిన వాహనదారులు

ఆల్విన్‌కాలనీ: నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు కుంగిపోతున్నాయి. మరికొన్ని చోట్ల పగిలి ప్రమాదకరంగా మారాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, ఆస్‌బెస్టాస్ కాలనీ, సాయినగర్ తదితర ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ కుంగిపోయాయి. స్థానికులు రక్షణగా కట్టెలు, రాళ్లు, ఇతరత్ర వస్తువులు ఏర్పాటు చేసి ప్రమాద నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. వాటర్‌వర్క్స్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్లు డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిర్మించేటప్పుడు నాసిరకంతో కూడిన సిమెంట్, ఇసుకలతో ఏర్పాటు చేయటం వల్ల ఈ దుస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడవక ముందే పగిలిపోతున్నాయి. అయినా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ లోపలి భాగంలో కనీసం ప్లాస్టింగ్ కూడా చేయకుండా వదిలివేయటంతో డ్రైనేజీలో ఎలుకలు చేరి రంధ్రాలు చేయటంతో కుంగిపోయి డ్రైనేజీ నీరు బయటకు వస్తుంది. రోడ్డుపై ప్రవహించి దుర్గంధం, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు, కార్లు వేగంగా వచ్చి కుంగిపోయిన మ్యాన్‌హోల్‌ను గుర్తించలేక అదుపు తప్పి ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రతి రోజూ ఎవరో ఒకరు ప్రమాదాల భారినపడి గాయాల పాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నాణ్యతతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మాణం చేపట్టాలని, పగిలిన మ్యాన్‌హోల్ మూతల స్థానంలో నూతన మూతలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఎల్లమ్మబండ హైటెన్షన్ లైన్‌లో మూత లేకుండా ఉన్న మ్యాన్‌హోల్

‘ఎన్‌ఐఏబీ’లో ముగిసిన వేడుకలు



వివిధ పోటీలలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని జాతీయ జంతు జీవ సాంకేతికత సంస్థ(ఎన్‌ఐఏబీ)లో మూడురోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. శుక్ర, శని, ఆదివారాల్లో విద్యావైజ్ఞానిక ప్రదర్శన, ప్రత్యేక ఉపన్యాసం మొక్కలు నాటే కార్యక్రమం, క్రీడా పోటీలను నిర్వహించారు. క్యాంపస్‌లో పలు రకాల మొక్కలను నాటారు. ఇదిలా ఉండగా ఎన్‌ఐఏబీ హైదరాబాద్ క్యాంపస్‌లో క్రీడా పోటీలనుగత నెలరోజులపాటు ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. విధులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఈ వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించగా వాటిల్లో క్రీడాస్ఫూర్తితో ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం క్రీడాపోటీలలో గెలుపొందిన వారికి ఎన్‌ఐఏబీ డైరెక్టర్ డాక్టర్ జి తరుశర్మ బహుమతులను అందించారు.



గౌలిదొడ్డిలోని ఎన్‌ఐఏబీ క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ హాజరై కార్పొరేటర్‌తో కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ శ్రేణులు వేడుకల్లో పాల్గొన్నారు. కార్పొరేటర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయటమే లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్‌పర్సన్ ఇందుమతి శ్రీరంగం తదితరులు

కూకట్‌పల్లి: ఉమెన్ ఇంటర్ నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, బి2బి ఎక్స్‌పో 2025 గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్, శ్రీరంగం ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇరు సంస్థలు కలిసి నూతన మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధికి, వ్యాపార అవకాశాల విస్తరణకు సహరించుకుంటాయని శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్‌పర్సన్ ఇందుమతి శ్రీరంగం తెలిపారు. కార్యక్రమంలో 108 మంది మహిళా వ్యాపారవేత్తలకు శక్తి అవార్డులు ప్రదానం చేశారు.

తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యను అందించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

గచ్చిబౌలి: ప్రైవేటు విద్యాసంస్థలు తక్కువ ఫీజుతో నాణ్యతతో కూడిన విద్య అందించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. శనివారం రాత్రి శిల్పకళావేదికలో సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మారుతున్న కాలం, టెక్నాలజీకి అనుగునంగా విద్యాసంస్థలను నడపడం అభినందనీయమన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా, తెలంగాణ కళా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఆల్విన్‌కాలనీ: కూచిపూడి నృత్య కళా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆదివారం అవార్డులను అందజేశారు. బిర్లా భాస్కర ఆడిటోరియంలో కళాకర్ తెలుగు టీవీ, శివనంది అవార్డ్స్–2025 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు దైవజ్ఞ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నృత్య పోటీల్లో హైదర్‌నగర్‌లోని రుహాని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో బిందు మాధవి, భావనలతో పాటు పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు దైవజ్ఞ శర్మ అవార్డులు ప్రదానం చేశారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి



మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం సైక్‌నాడియా బృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో మూషికవాహన, మహిషాసుర మర్థిని తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. శ్రీనవ లాస్య కళానిలయం ఆధ్వర్యంలో కర్ణాటక గాత్ర కచేరి, కూడిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

జగద్గిరిగుట్ట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కార్మికులకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాల్గవ మహాసభలు ఆదివారం గుబురుగుట్టలోని కార్మికుల అడ్డా వద్ద జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్ రావుతో కలిసి హాజరై ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను మారుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యం వీడాలి.. సంరక్షణ పెరగాలి

గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం, వనమహోత్సవం లక్ష్యం కొరవడింది. పర్యవేక్షణ కరువై, నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతోంది. మొక్కల సంరక్షణపై పాలకులకు శ్రద్ధ లేకపోవటంతో పనులు ముందుకు సాగడం లేదు. పురపాలక సంఘాలు, పంచాయతీల్లో నర్సరీలను పెంచే బాధ్యతను ప్రస్తుతం డీఆర్డీఏ చూస్తోంది.

– సాక్షి,సిటీబ్యూరో

- హరితహారం, వనమహోత్సవం మొక్కల పెంపకంపై దృష్టి
- ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో ఎండుతున్న మొక్కలు
- దయనీయంగా పల్లె, పట్టణ ప్రకృతి వనాలు
- ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంటున్న ప్రజలు



మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో హరితహారం, వనమహోత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు దాదాపు 5.50 కోట్ల మొక్కలు నాటారు. అధికారిక లెక్కల్లో జియో ట్యాగింగ్ రూపంలో వాటి లెక్కలు కనపడుతున్నాయే తప్పా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనబడుతోంది.

నిలువెల్లా నిర్లక్ష్యం..

జిల్లాలో కొన్ని పంచాయతీలు, పురపాలక సంఘాలు మాత్రమే మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపుతుండగా, మరి కొన్ని చోట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. మొక్కలు నాటే సమయంలో చేస్తున్న పర్యవేక్షణ.. సంరక్షణ చర్యల్లో ఏమాత్రం కనిపించడం లేదనే విమర్శలున్నాయి. నర్సరీల నిర్వహణకు రూ. లక్షల్లో ఖర్చు చేసి మొక్కలు పెంచి, వాటిని సంరక్షించకుండా గాలికి వదిలేయడంతో ప్రజాధనం వృథా అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొక్కల పెంపకానికి రోజూవారి చెల్లింపులు..

ఒక్కో నర్సరీలో మొక్కల పెంపకానికి కూలీకి రూ. 257లు రోజువారీగా చెల్లిస్తున్నారు. మట్టిని కవర్లలో నింపి విత్తనాలు విత్తేందుకు దాదాపు రూ. 1.20 వెచ్చిస్తున్నారు. ఒక్కో మొక్క నాటేందుకు, పాదులు తీసేందుకు రూ.37 వరకు ఖర్చు చేస్తున్నారు. రక్షణ కంచెకు రూ. 6, నీరు పోసేందుకు రూ.3 కేటాయిస్తున్నారు. ఇంత వ్యయం చేసి మొక్కను బతికించుకోకుంటే నిధులు వృథా అవుతున్నాయి.

పనులకు ఆటంకాలు..

పంచాయతీ, పట్టణాలకు వచ్చే పల్లె, పట్టణ ప్రగతి నిధులు, ఇతర గ్రాంట్స్ 10 శాతం వరకు హరితహారం, వనమహోత్సవాలకు వెచ్చిస్తున్నారు. ఇటు మొక్కలు బతకపోగా అటు పంచాయతీలు, పురపాలికల్లోని నిధుల్లో నుంచి 10 శాతం కోతతో ఇతర అభివృద్ధి పనులకు ఆటంకాలు తప్పడం లేదు.

214 ఎకరాల్లో 102 పల్లె వనాలు..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలోని 214 ఎకరాల్లో 102 పల్లె, పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఏర్పాటు చేశారు.

ఎకరానికి 2,500 మొక్కలు..

ఉపాధి హామీ పథకం కింద నిధులు వెచ్చించి ఎకరానికి 2,500 మొక్కల చొప్పున నాటడం వల్ల చిన్న వృక్షాలుగా అభివృద్ధి చెందాయి. పల్లెలతో పాటు నగరవాసులకు పల్లె,పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుండగా... నిర్వహణలో తలెత్తిన లోపం, నిర్లక్ష్యం కారణంగా పల్లె,పట్టణ ప్రకృతి వనాలు పచ్చదనాన్ని కోల్పేయే పరిస్థితికి చేరుకున్నాయి.

ఎండిపోతున్న మొక్కలు..

పర్యవేక్షణలో కొరవడిన అలసత్వం కారణంగా ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. జిల్లాలో మండలాల వారీగా పల్లె,పట్టణ ప్రకృతి వనాలు ఈ విధంగా ఉన్నాయి.

◆ శామీర్‌పేట మండలంలో 10 పల్లె ప్రకృతి వనాలు (పార్కులు), ఘట్కేసర్ మండలంలో 18, కీసరలో 9 , మూడు చింతలపల్లి మండలంలో 13, మేడ్చల్‌లో 22 పల్లె ప్రకృతి వనాలు (పార్కులు) ఉన్నాయి.

◆ 13 పురపాలక సంఘాల్లో 21 పట్టణ ప్రకృతి వనాలు ఉండగా.. పార్కుల నిర్వహణ బాధ్యతలను సంబంధిత పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలతో సహా జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖలు, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) నిరంతరంగా పర్యవేక్షించాల్సి ఉండగా.. ప్రత్యేక శ్రద్ధ కనబరచడం లేదని విమర్శలున్నాయి.

సంపద వనాలు పరిస్థితి అంతే...

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 5 మండలాల పరిధిలో 8 నుంచి పదెకరాల లోపు ప్రభుత్వ భూముల్లో వెలసిన సంపద వనాల నిర్వహణ కూడా మొక్కుబడిగానే కొనసాగుతోంది. వీటిని కూడా పట్టించుకునేవారే లేకపోవడంతో ఎండలకు వాడిపోతున్నాయి. పచ్చదనానికి తోడుగా పండ్లు ,కలప ,సుగంధ ద్రవ్యాలను ఇచ్చే టేకు, గంధం, నీలగిరి, ఉసిరి, జామ, మామిడి తదితర మొక్కలు పెంపకం ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు కాచవాని సింగారం, బొమ్మరాసిపేట్, శ్రీరంగవరం, జగన్‌గూడ, చీర్యాలలో సంపదవనాలను పెంచుతున్నారు.

పర్యవేక్షణ లోపం...

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో గ్రామాలు, పట్టణాల మధ్య రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కల సంరక్షణలో కూడా పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. శాఖల మధ్య కొరవడిన సమన్వయంతో మొక్కలకు నీరు అందడం లేదు. దీంతో గ్రామాలు, పట్టణాల మధ్య ఉన్న రహదారులు, రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి.

◆ జిల్లాలోని మూడుచింతలపల్లి, ఉద్దమర్రి, కేశ్వాపూర్, కేశవరం, అలియాబాద్, మజీద్‌పూర్, ఎదులాబాద్, కొర్రెముల, రావల్‌కోల్, సోమారం, ఎల్లంపేట, శ్రీరంగవరం, బండమాదారం, తిమ్మాయిపల్లి, కీసర, అంకిరెడ్డిపల్లి, యాద్గార్‌పల్లి గ్రామాల్లో మొక్కలకు నీటి నిర్వహణ సరిగ్గా లేకపోవటంతో ఎండిపోతున్నాయి.

◆ మేడ్చల్, ఘట్కేసర్, దుండిగల్, బోడుప్పల్, నిజాంపేట్, గుండ్లపోచంపల్లి, నాగారం, తూముకుంట, కొంపెల్లి పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో కూడా మొక్కలు వాడిపోతున్నాయి.

◆ జిల్లాలో 30 నుంచి 40 శాతం మొక్కలు ఎండిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ప్రజలు ఎన్నుకున్న పాలక వర్గాల గడువు ముగియడంతో గత కొంతకాలంగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

ప్రత్యేక అధికారులు మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవటంతో సిబ్బంది వాటిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగంతో సహా డీఆర్డీఏ, అటవీ, పంచాయతీశాఖలు, పురపాలక సంఘాలు, సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఎండుతున్న మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.